క్లుప్తంగా

న్యాయవాదులకు వైద్య శిబిరం



కళ్లజోళ్లను పరిశీలిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు తదితరులు

కాకినాడ లీగల్: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో న్యాయవాదులు పలు పరీక్ష చేయించుకున్నారు. స్థానిక క్లోవే డెంటల్ హాస్పిటల్, కంటి ఆస్పత్రి శుక్రవారం సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ హాల్లో కంటి, పంటి సమస్యలకు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందుబాటులో ఉంచారు. వైద్య శిబిరంలో డాక్టర్ అగర్వాల్, కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వర్గీకరణతో చిరకాల వాంఛ నెరవేరింది

బోట్‌క్లబ్: మాదిగల 30 ఏళ్ల కోరిక నెరవేరిందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఏడిద కృష్ణ అన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అమలుపై మాదిగలు హర్షం వ్యక్తం చేస్తూ రేచర్ల పేటలోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూల మాలలు వేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నో పోరాటాలు చేసిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విజయం సాధించారన్నారు. బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి మాల కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్, హరీష్

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ ప్లస్ టు విద్యార్థినులకు శుక్రవారం సానా సతీష్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ తలాటం హరీష్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కూటమి నాయకులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింగళి తెలుగువారు కావడం గర్వకారణం



జాతీయ జెండాను పంపిణీ చేస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: భారత జాతీయ జెండా సృష్టికర్త పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, రవి, బొట్టా అనిల్, సోనీ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఘన నివాళులర్పించింది. సర్పవరం జంక్షన్‌లో పింగళి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, గల్లా సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, శ్రీనగేష్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

జల గరళం

- రెండు నెలలుగా కలుషిత నీటి సరఫరా
- సమస్య చెప్పినా పట్టించుకోని అధికారులు
- స్వయంగా తనిఖీ చేసిన డీపీఓ



డ్రైవర్స్‌కాలనీలో తాగునీటి నమూనాలను సేకరిస్తున్న పంచాయతీ అధికారులు

కాకినాడ సిటీ: వర్షాకాలం నీరు కలుషితమయ్యే అవకాశం ఉండే సమయం. అందుకే తాగునీటి సరఫరాపై అటు గ్రామ, ఇటు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. క్లోరినేషన్‌తో పాటు నీటి శుద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. కానీ కాకినాడ రూరల్ మండలం తూరంగిలో తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా కలుషితనీరు ఇళ్లకు సరఫరా అవుతోంది. ఆ నీటితో స్నానాలు చేస్తున్న వారికి ఒళ్లు దురదలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తూరంగి పంచాయతీ పరిధిలో దాదాపు 30 వేలకు పైగా జనాభా ఉండి 15 వేలకు పైగా ఆవాసాలున్నాయి. తూరంగి పంచాయతీ పరిధిలోని బుల్లబ్బాయిరెడ్డినగర్ వద్ద 10 ఎకరాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి పంప్‌హౌస్ నుంచి తూరంగి, కరప మండలం ఉప్పలంక, నడకుదురు, పెనుగుదురు తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. పంప్‌హౌస్‌లో క్లోరినేషన్ చేయడంతో పాటు పటికను కలుపుతారు. గతంలో ఈ పంప్‌హౌస్ నుంచి శుభ్రమైన నీరు సరఫరా అయ్యేది. రెండు నెలలుగా ఈ పంప్‌హౌస్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కలుషిత నీరు వస్తోంది.

చర్మ వ్యాధులకు ఆస్కారం

కలుషిత నీటితో స్నానం చేసినా, వంట చేసినా ఇబ్బందేనని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం తూరంగిలో ప్రతి ఇంట్లోనూ పంచాయతీ సరఫరా చేసిన నీటినే వాడుతున్నారు. స్నానానికి, వంటకు ఇతర అవసరాలకు ఆ నీరే వాడకం. మట్టి రంగులో ఉన్న నీటితో స్నానం చేయడం వల్ల శరీరంపై దద్దర్లు తదితర స్కిన్ అలర్జీలు వస్తున్నాయి. ఆ నీటితో వండిన ఆహారం తినడం వల్ల డయేరియా ప్రబలుతోంది. తూరంగి డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీల్లో రక్షిత నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా అందిస్తున్నా నీరు రంగ మారి రావడం, అక్కడక్కడ నీటిలో వివిధ రకాల నలకలుగా రావడంతో పంచాయతీ అధికారులు పలు దఫాలుగా పరిశీలించారు. ఇంటింటా నీటిని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్లలో ఎక్కడైనా లీకేజ్ ఉందేమోనని అధికారులు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. తాగునీటి పైపుల ద్వారా మురుగు నీరు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య సైతం ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి తూరంగి డ్రైవర్స్‌కాలనీ, ఏఎస్ఆర్ కాలనీల్లో తాగునీటిని సరఫరా చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకులను సందర్శించి తనిఖీ చేశారు.



తాగునీటి ట్యాంకుల పరిశీలనకు వచ్చిన డీపీవో భారతి సౌజన్యను చుట్టుముట్టి నిలదీస్తున్న గ్రామస్తులు

దురదలు వస్తున్నాయి



తూరంగి పంచాయతీ ద్వారా సరఫరా చేస్తున్న నీటితో స్నానం చేస్తుంటే శరీరంపై దురదలు వస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేశాం. అధికారులు వస్తున్నారు, చూసి వెళ్తున్నారు. చర్యలు మాత్రం శూన్యం. అయినా సరఫరా చేస్తున్న నీటిలో ఏ మాత్రం మార్పులేదు. కొంత మంది ఆ నీటితో చేసిన ఆహార పదార్థాలు తిన్నవారు డయేరియా బారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వైద్యానికి రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలి.

– చింతపల్లి అజయ్‌కుమార్, తూరంగి పౌర సంక్షేమ సంఘం నాయకులు

శాకంబరిగా సత్తెమ్మతల్లి



శాకంబరి అలంకరణలో ఈశ్వర్‌నగర్ విజయ సత్తెమ్మ తల్లి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద ఈశ్వర్‌నగర్‌లోని విజయ సత్తెమ్మ తల్లి శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం భక్తుల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

సంతచెరువు కనకదుర్గమ్మ..



శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

బోట్‌క్లబ్: స్థానిక సంతచెరువు వద్ద ఉన్న కనకదుర్గమ్మ తల్లిని శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. గర్భాలయంతో పాటు అమ్మవారిని, ఆలయ పరిసరాలను తీర్చిదిద్దారు. అమ్మవారిని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దర్శించుకొన్నారు. టీడీపీ, జనసేన నాయకుల రాకతో సాధారణ భక్తులకు తీవ్ర ఆటంకం ఎదురైంది. ఈఓ జోగా సత్యనారాయణ పరిస్థితిని నియంత్రించలేకపోవడంతో సాధారణ భక్తులు దర్శనం కోసం గంటలు తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- సర్పవరం, కాకినాడ రూరల్ సీఐలుగా పెద్దిరాజు, చైతన్యకృష్ణ నియామకం



కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ



సర్పవరం సీఐ పెద్దిరాజు

కాకినాడ రూరల్: ప్రజలకు సకాలంలో పోలీసు సేవలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని సర్పవరం, కాకినాడ రూరల్ సీఐలుగా బాధ్యతలు చేపట్టిన బొక్కా పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ పేర్కొన్నారు. సీఐల బదిలీలలో భాగంగా సర్పవరం స్టేషన్ సీఐగా పెద్దిరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన వైఆర్‌కే శ్రీనివాస్ స్థానంలో ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రావులపాలెం, రాజోలు, అంతర్వేది తదితర చోట్ల పనిచేసిన పెద్దిరాజు ప్రస్తుతం వీఆర్ నుంచి సర్పవరం స్టేషన్‌కు సీఐగా నియమితులయ్యారు. కాకినాడ ట్రాఫిక్ – 2 సీఐగా పనిచేస్తున్న డీఎస్ చైతన్యకృష్ణ కాకినాడ రూరల్ సర్కిల్‌కు సీఐగా నియమితులవ్వడంతో ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, ట్రాఫిక్ సీఐ రమేష్, ట్రాఫిక్ ఎస్సైలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. చైతన్యకృష్ణకు గతంలో సర్పవరం స్టేషన్‌లో పనిచేసిన అనుభవం ఉంది.

సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం

బోట్‌క్లబ్: ఎస్సీ, ఎస్టీలను ఉప కులాలుగా వర్గీకరించడానికి రాష్ట్రాలకు అధికారాలు కల్పించేలా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి (ఆర్టికల్ 341) పూర్తి వ్యతిరేకమని పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ శుక్రవారం పత్రికా ప్రకటలో తెలిపారు. ఇదే విషయంలో సుప్రీం కోర్టు 2004 నవంబరు 5న ఇచ్చిన తీర్పును కాదని నేడు కొత్తగా తీర్పు వెలువరించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉన్నట్టు భావిస్తున్నామన్నారు. 2004లో ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ కులాల విషయంలో ఏవైనా మార్పులు చేర్పులు చేయాలంటే అది భారత పార్లమెంటు ద్వారా మాత్రమే చేయాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 2004 తీర్పుతో దారులు మూసుకుపోయాయని, ఇక పార్లమెంటు మాత్రమే నిర్ణయం తీసుకోవాలని, అందుకు బిల్లు పెట్టాలని ఇన్నాళ్లు పట్టుబట్టిన కృష్ణమాదిగ తిరిగి 2011లో అదే సుప్రీం కోర్టును ఆశ్రయించడం చూస్తే అతని వెనుక మనువాద పార్టీలు ఉన్నాయన్నారు. ఈ తీర్పు భవిష్యత్ లో దళితులపై తీవ్ర ప్రభావం చూపుతుందని దానికి బాధ్యుడు కృష్ణ మాదిగ అని పేర్కొన్నారు. ఈ తీర్పుపై పూర్తి సమాచారం సేకరించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, అందుకు దళితులంతా సిద్ధం కావాలని కోరారు.

వర్షపు నీరు నిలువకుండా చర్యలు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ భావన

అధికారులకు కమిషనర్ భావన ఆదేశం

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం నగరంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. నగరంలోని భానుగుడి సెంటర్, టూటౌన్, ఫ్లై ఓవర్ సెంటర్లలో పర్యటించిన కమిషనర్ విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పలు చోట్ల రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గుర్తించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. టూటౌన్ సాయిబాబా గుడి వద్ద ఉన్న ప్రధాన కల్వర్టును పరిశీలించారు. అలాగే వ్యాపార సముదాయాల నుంచి చెత్త సేకరిస్తున్న తీరును పర్యవేక్షించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ సత్తెప్ప నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరెడ్డి



కాకినాడ లీగల్: సర్పవరం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కేవీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జిగా సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇప్పటి వరకు డిప్యూటేషన్‌పై సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సి.రమేష్‌కు డిప్యూటేషన్ రద్దు చేయడంతో యథాస్థానం మామిడికుదురుకు సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

డీఎఫ్ఓ భరణి



జిల్లా అటవీ అధికారి భరణిని సత్కరిస్తున్న ఏజీఎం రాఘవేంద్రరావు తదితరులు

కాకినాడ: విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి పేర్కొన్నారు. స్థానిక రామారావుపేటలోని నారాయణ ఈ టెక్నో ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం ఇన్వెస్టిట్యూర్ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. గౌరవ అతిథిగా హాజరైన పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు జార్జి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకోవాలని వివరించారు. ఎన్నికైన వివిధ విభాగాల విద్యార్థి నాయకులను విశేష అతిథి, ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ షర్మిల, ఇ- కిడ్స్ జోనల్ కోఆర్డినేటర్ సపూరా, ఆర్ఎస్‌టీ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు బ్యాడ్జిలతో సత్కరించారు. తదనంతరం విద్యార్థి నాయకులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా సాఫ్ట్ స్కిల్స్ మెంటర్ పద్మలత వ్యవహరించారు.

సామర్లకోట సీఐగా అంకబాబు



సామర్లకోట: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఆర్.అంకబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సీఐగా పని చేసిన సురేష్ బదిలీ కావడంతో అతని స్థానంలో సామర్లకోట క్రైం సీఐగా పని చేస్తున్న అంకబాబును నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కరప: మండలం పెనుగుదురులో పిచ్చికుక్క దాడి చేయడంతో పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన కథనం మేరకు శుక్రవారం ఆ గ్రామానికి చెందిన బండారు బూరయ్య, మరికొంత మందిపై పిచ్చి కుక్క దాడిచేసి గాయపరచింది. పిచ్చి కుక్క స్వైర విహారంపై స్థానికులు పలు సందర్భాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో స్థానికులు తాళ్లరేవు నుంచి ఒక వ్యక్తిని తీసుకొచ్చి, పిచ్చికుక్కను బంధించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

డాక్టర్ సత్యవతికి గ్లోబల్ ఐకాన్ పురస్కారం

- ప్రసూతి వైద్య సేవల్లో దేశంలోనే మేటిగా కితాబు



బాలీవుడ్ నటి శిల్పాశెట్టి చేతుల మీదిగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ సత్యవతి

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ ఏఎల్ సత్యవతిని ప్రతిష్టాత్మక గ్లోబల్ ఐకాన్–2024 అవార్డు వరించింది. ప్రసూతి వైద్య రంగంలో దేశంలోనే మేటి వైద్యురాలిగా ఆమెకు అరుదైన గౌరవం దక్కింది. గత ఆదివారం ప్రముఖ బాలీవుడ్ కథానాయిక శిల్పాశెట్టి చేతుల మీదుగా డాక్టర్ సత్యవతి ఢిల్లీలో ఈ అవార్డును అందుకున్నారు. ఈమె కాకినాడలోని కోకిల జంక్షన్‌లో సృజన మల్టీ స్పెషాలిటీ అండ్ ఐవీఎఫ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కృత్రిమ గర్భధారణ, మాతాశిశు సంరక్షణ, గర్భధారణ వేళ అత్యుత్తమ వైద్య సేవ, గర్భిణిలో ప్రసవానంతర ఆరోగ్య నిర్వహణ అంశాల ప్రాతిపదికన చేపట్టిన ప్రత్యేక పరిశీలనలో ఆమె అత్యుత్తమ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం సృజన మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రసూతి వైద్యరంగంలో కాకినాడ ఘనతను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం ఆనందాన్నిచ్చిందన్నారు. డాక్టర్ సత్యవతికి నగరంలోని ప్రముఖ వైద్యులంతా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మార్చింగ్ బ్యాండ్ బహూకరణ



మార్చింగ్ బ్యాండ్‌ను హెచ్‌ఎం సాయిమోహన్‌కు అందజేస్తున్న ఉపాధ్యాయుడు వేణుగోపాల్

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు టి.వేణుగోపాల్ రూ.4 వేల విలువైన మార్చింగ్ బ్యాండ్‌ను శుక్రవారం హెచ్‌ఎం ఎ.సాయిమోహన్‌కు అందజేశారు. పాఠశాలలో నిర్వహించే జాతీయ పండగల సందర్భంలో అతిథులను ఆహ్వానించేటప్పుడు, ఎన్‌సీసీ కార్యక్రమాల్లో ఈ బ్యాండ్ చాలా ఉపయోగ పడుతుందన్నారు. హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ ఎస్.రామలింగేశ్వరరావు దాత వేణుగోపాల్‌ను అభినందించారు.

అమ్మపాలే అమృతం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి

కాకినాడ సిటీ: అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం, మురిపం అనే సుగుణాలు ఉన్నాయని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వై.లక్ష్మి అన్నారు. శుక్రవారం తూరంగి ఈశ్వర్‌కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో తూరంగి పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, తొలి టీకా తల్లిపాలే అన్నారు. నూరుశాతం పోషక విలువలున్న తల్లి పాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వైద్యాధికారి ఫణితేజ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సింహాచలం, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.లోవలక్ష్మి, భవాని, శుభ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో కేంద్ర బృందం పరిశీలన



అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోషకాహారం, ఆకుకూరలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కాకినాడ రూరల్: కాకినాడ 49 డివిజన్ గైగోలుపాడులోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను కేంద్ర బృందం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెనెస్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) వైద్యులు వలర్మతి, ఇందిరా సందర్శించారు. ఈ కేంద్రంలో సదుపాయలపై ఆరా తీశారు. రెండు రోజులు పాటు ఆస్పత్రిలో పరిశీలించనున్నట్టు వారు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ నరసింహ, డీపీఎంఓ డాక్టరు సురేఖ, వైద్యుడు శ్రీనుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

కాకినాడ అర్బన్ ప్రాజెక్టు రమణయ్యపేట సెక్టారులోని గైగోలుపాడు అర్బన్ హెల్త్ సెంటరులో శుక్రవారం తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్రం నుంచి వచ్చిన పరిశీలన బృందం వైద్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం!

- సాయి సిరి సంస్థ నిర్వాహకులపై మియాపూర్‌లో కేసు నమోదైనట్టు వైరల్
- సిటీ ఎమ్మెల్యే కొండబాబును ఆశ్రయించిన బాధితులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామానికి చెందిన దంపతులు, మరి కొందరి సహకారంతో హైదరాబాద్, కాకినాడలలో సాయి సిరి టెక్నాలజీస్ సంస్థను ఏర్పాటు చేసి ఉద్యోగాల పేరిట భారీగా సొమ్ములు వసూలు చేసి మోసానికి పాల్పడినట్టు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం వైరల్ అయ్యింది. డబ్బులు దండుకుని బోర్డు తిప్పేసిన సదరు సంస్థకు చెందిన దంపతులపై మియాపూర్‌లో కేసు నమోదైనట్టు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగాల కోసం రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడటంతో పాటు వీసాలు ఇప్పిస్తామని కోట్ల రూపాయలు వసూలు చేసిన దంపతుల నుంచి తమకు న్యాయం చేయాలని సిటీ ఎమ్మెల్యే కొండబాబును బాధితులు ఆశ్రయించినట్టు తెలిసింది. వీసా పేరిట సొమ్ములు వసూలు చేసినట్టు ఆరోపణలు వైరల్ అయ్యాయి. దీనిపై ఇంద్రపాలెం ఎస్సై మణికుమార్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.